క్లుప్తంగా

పాయసం పంపిణీ



చాగల్లులో పాయసం పంపిణీ చేస్తున్న దృశ్యం

చాగల్లు: మానవత ఆధ్వర్యంలో రంజాన్ సందర్భంగా చాగల్లులో పాయసం పంపిణీ చేశారు. అనంతరం చలివేంద్రంలో ఉచిత మజ్జిగ పంపిణీ కూడా చేశారు. జానీ బాషా, మానవత డైరెక్టర్ ఆతుకూరి వెంకటేశ్వరరావు, ఉషారాణి దంపతుల సహకారంతో సోమవారం ఈ కార్యక్రమం నిర్వహించినట్లు మానవత అధ్యక్షుడు జుజ్జవరపు వెంకటకృష్ణ ప్రసాద్ తెలిపారు.

ఘనంగా పుంత ముసలమ్మ తల్లి జాతర

ఉండ్రాజవరం: వెలగదుర్రులోని కొత్తూరులో కొలువైన పుంత ముసలమ్మ తల్లి జాతరను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. ఆలయం వద్ద కోలాటం ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. ఈ జాతరను కమిటీ నిర్వాహకుడు ముదునూరి వరదరాజు, కొలనువాడ సూర్యానారాయణ రాజు, ఇందుకూరి సుబ్బరాజు, నండూరి శేషగిరిరావు, వీరంశెట్టి సూరి, ఇందుకూరి మురళి కృష్ణంరాజు పర్యవేక్షించారు.

5న వీఆర్‌ఏల రాష్ట్ర సదస్సు

నల్లజర్ల: వీఆర్‌ఏల సమస్యల పరిష్కారం కోసం విజయవాడలో ఈ నెల 5న రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా నాయకుడు కొక్కిరపాటి వెంకట్రావు తెలిపారు. వీఆర్‌ఏలకు పే స్కేల్ జీతాలు చెల్లించాలని, నిబంధనలకు విరుద్ధంగా చేసిన నైట్‌డ్యూటీలను తక్షణమే నిలుపుదల చేయాలని, వీఆర్‌ఓ, అటెండర్, వాచ్ మెన్, రికార్డు అసిస్టెంట్ తదితర ఖాళీల్లో అర్హులైన వీఆర్‌ఏలకు ప్రమోషన్లు ఇవ్వాలని, ఈ పోస్టుల్లో ప్రమోషన్లకు 70 శాతం రిజర్వేషన్ వీఆర్‌ఏలకు కేటాయించాలని కోరారు. ఈ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం భవిష్యత్తు కార్యాచరణ రూపొందించేందుకు ఈ సదస్సు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ సదస్సుకు పీడీఎస్ మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. వీఆర్‌ఏలు తప్పనిసరిగా ఈ సదస్సుకు హాజరుకావాలని కోరారు.

గోపవరం ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

నిడదవోలు రూరల్: గోపవరంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్ గాలింకి రాము అధ్యక్షతన గ్రామ కమిటీ ఎన్నిక సోమవారం నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడిగా దున్నా భాను, ఉపాధ్యక్షుడిగా కంకిపాటి బన్ను, కార్యదర్శిగా ముప్పిడి రవి, కోశాధికారిగా ముప్పిడి అఖిల్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ తాతపూడి జగదీష్, నాయకులు ముప్పిడి సుధీర్, నరసింహరావు, తాతారావు, దున్నా ప్రసాద్ పాల్గొన్నారు.

శ్యాం రవిప్రకాష్‌కి అంబేడ్కర్ పురస్కారం

కొవ్వూరు: డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ ఉగాది పురస్కారం దక్కించుకోవడం ఆనందంగా ఉందని మాల సంఘాల జేఏసీ కన్వీనర్ బొంతా శ్యాం రవిప్రకాష్ ఆదివారం పేర్కొన్నారు. రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు దాసరి చెన్నకేశవులు, మాల ఉద్యోగుల సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్ బాబు సంయుక్తంగా ఈ ఉగాది పురస్కారాలు అందజేసినట్లు ఆయన తెలిపారు. ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలో ఈ పురస్కారం అందుకున్నట్లు ఆయన తెలిపారు.

వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఉండ్రాజవరం: వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ప్రజల దాహార్తి తీర్చేందుకు అన్ని పంచాయతీలు చర్యలు చేపట్టాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ సూచించారు. మండలంలో సూర్యారావుపాలెంలో గ్రామ ఊర చెరువు ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించే కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 6 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువును శుభ్రం చేసి కాలువ నీటిని చెరువులో నింపి, స్టోరేజ్ ఫిల్టర్ ద్వారా శుద్ధి చేసిన తాగునీటిని ఇంటింటికీ పంపిణీ చేస్తారన్నారు. సర్పంచ్ మెండే లలితకుమారి మాట్లాడుతూ సూర్యారావుపాలెంతో పాటు పరిసర ప్రాంతాల్లోని దువ్వ, పసలపూడి, రెడ్డి చెరువు గ్రామస్తులు తాగునీటి కోసం ఈ చెరువును ఉపయోగిస్తారన్నారు. దాతల ఆర్థిక సహకారంతో సుమారు రూ. 2 లక్షలతో మంచినీళ్లు పట్టుకునేందుకు చెరువు చూట్టు ఐదు రేవులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో పాడైపోయిన డ్రెయినేజీ వ్యవస్థను పునర్నిర్మించాలని గ్రామస్తులు కోరారు. ఈకార్యక్రమంలో టీడీపీ, జనసేనా నాయకులు అధికారులు పాల్గొన్నారు.



ప్రక్కిలంకలోని ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



కాపవరం మసీదులో ప్రార్థన చేస్తున్న ముస్లింలు



పోతవరం ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు



దేవరపల్లి మండలం యాదవోలులో ఈద్గా వద్ద నమాజ్ చేస్తున్న ముస్లింలు



నిడదవోలులో ముస్లింలతో కలిసి సామూహిక ప్రార్థనలో పాల్గొన్న మంత్రి దుర్గేష్

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

- మసీదులలో ప్రార్థనలు
- ఉపవాస దీక్షల విరమణ
- పేదలకు దుస్తులు, ఆహారం వితరణ



నిడదవోలులో సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

దేవరపల్లి: మండలంలోని ముస్లింలు రంజాన్ పండగను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. నెల రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు, ప్రత్యేక తరావీహ్ నమాజ్, సహర్, ఇఫ్తార్లు, ఖురాన్ పఠనం, దానధర్మాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో గడిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ చుక్క నీరు కూడా తాగకుండా నిష్ఠతో ఉపవాస దీక్షలు పాటించారు. ఆదివారం సాయంత్రం చంద్రదర్శనం కావడంతో ఉపవాస దీక్షలు ముగించి, పండగ నిర్వహించుకున్నారు. నూతన వస్త్రాలు ధరించి మసీదులకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నెల రోజుల తమ ప్రార్థనలు ఫలించాలని, సర్వ మానవాళి సంతోషంగా ఉండాలని కోరుతూ అల్లాహ్‌కు దువా చేశారు. బంధువులు, మిత్రులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనిత ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

పేదలకు దానాలు

తాళ్లపూడి: మండలంలో ముస్లిం సోదరులు ఈద్ ఉల్ ఫితర్ (రంజాన్)ను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తాళ్లపూడిలోని మసీదు నుంచి ర్యాలీగా వెళ్లి ప్రక్కిలంకలోని ఈద్గాలో ప్రత్యేక నమాజు చేసారు. అనంతరం వృద్ధులకు, పేదలకు దానాలు చేసారు. వేగేశ్వరపురంలోన మస్జీద్ ఏ నూర్, అన్నదేవరపేటలో ఉదయం నుంచి రంజాన్ సందర్భంగా ప్రత్యేక నమాజు కార్యక్రమాల్లో ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఇమామ్ ఖురాన్‌లోని సందేశాలను వివరించారు. ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముస్లింకు మండల ప్రజాప్రతినిధులు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ప్రెసిడెంట్ అబ్దుల్ రహీమ్ సర్దార్, మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు

కొవ్వూరు: రంజాన్ పర్వదినం సందర్భంగా సోమవారం ముస్లింలు పట్టణంలోని జామియా మసీదులో, ఇందిరమ్మ కాలనీలో మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నెల రోజుల నుంచి నిర్వహిస్తున్న ఉపవాస దీక్షలు రంజాన్ రోజు నెలవంకను చూడడంతో ముగిసింది. కాపవరం, గోవర్ధనగిరిమెట్టలోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కాపవరం మసీదులో నిర్వహించిన ప్రార్థనల్లో మాజీ డీసీసీ అధ్యక్షుడు ఎండీ రఫీయుల్లా బేగ్, నియోజకవర్గ కాంగ్రెస్ కో–ఆర్డినేటర్ ఎండీ ఫసీయుల్లా బేగ్ పాల్గొన్నారు.

అల్లా మార్గదర్శకాలకు ప్రతీక.. రంజాన్

నిడదవోలు రూరల్: ముస్లింలకు పవిత్రమైన రంజాన్ ఉపవాస దీక్షలు ఆదివారం రాత్రి నెలవంక దర్శనంతో ముగిసింది. నెలరోజుల ఉపవాసాల అనంతరం జరుపుకునే ఈద్ ఉల్ ఫితర్ (రంజాన్) పండుగను నిడదవోలు మండలంలోని ఆయా గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో సోమవారం జరుపుకున్నారు. ముస్లింలు సాంప్రదాయపద్ధతిలో ఆలింగనం చేసుకుని, పరస్పర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సమిశ్రగూడెం పెద్దమసీదులో నిర్వహించిన రంజాన్ వేడుకల్లో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ హాజరై ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ సర్పంచ్ ఎండీ అక్రం, నాయకులు ఉప్పులూరి రామ్మోహన్‌రావు, ముస్లిం నాయకులు పాల్గొన్నారు. తాడిమళ్ల, కోరుమామిడి, పెండ్యాల గ్రామాల్లోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. సమిశ్రగూడెంలో వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు గజ్జరపు శ్రీరమేష్ ఆర్థిక సహాయంతో 515 కుటుంబాలకు రంజాన్ కానుకలు అందజేశారు.

నిడదవోలు: నియోజకవవర్గంలో సోమవారం రంజాన్ వేడుకలను ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని బస్టాండ్ సెంటర్ మసీదు, చిన మసీదు, కురేషియా మసీదుల్లో ప్రత్యేక నమాజ్‌లు నిర్వహించారు. పట్టణంలోని యర్నగూడెం రోడ్డులోని జామియా మసీదు (పెద్ద మసీదు) కమిటీ ఆధ్వర్యంలో ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ పాల్గొని ప్రార్థనలు చేశారు. ముస్లిం సోదరులకు ఆయన రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ నలుమూలల నుంచి ముస్లింలు అధిక సంఖ్యలో తరలివచ్చి రంజాన్ నమాజ్‌లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కౌన్సిలర్ ఎస్‌కే వజీరుద్దీన్, పెద్ద మసీదు ముతవల్లీ అబ్దుల్ అజీజ్, కార్యదర్శి ఎండీ రోషన్, కోశాధికారి నూర్ అహ్మద్‌పాషా, పట్టణ జనసేన అధ్యక్షుడు రంగా రమేష్, మత పెద్దలు పాల్గొన్నారు.

కిటకిటలాడిన ఈద్గాలు, మసీదులు

నల్లజర్ల: రంజాన్ (ఈద్ ఉల్ ఫితర్) పండుగను సోమవారం నల్లజర్ల మండలంలో వివిధ గ్రామాల్లోని ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ముస్లింలు తక్బీర్ చదువుతూ ఆయా గ్రామాల్లో ఉన్న ఈద్గాల వద్దకు చేరుకున్నారు. పోతవరంలో మసీదు కమిటీ అధ్యక్షుడు సయ్యద్ బాజీ, ఉపాధ్యక్షుడు కదీర్ నియమనిష్ఠలతో దువా చేసారు. నల్లజర్ల, దూబచర్ల, అనంతపల్లి, ఆవపాడు మసీదులలో రంజాన్ ప్రార్థనలు నిర్వహించారు.

ఉపవాస దీక్షలు విరమించి..

ఉండ్రాజవరం: ముస్లింల పవిత్రదినం రంజాన్ పర్వదినాన్ని మండలంలో ముస్లిం సోదరులు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలో పాలంగి, మోర్త, ఉండ్రాజవరం, వేలివెన్ను, చిలకపాడు, చివటం తదితర గ్రామాల్లో ముస్లింలు ఉపవాస దీక్షలు విరమించి మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాలంగిలో రాష్ట్ర పర్యాటక, సంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ముస్లింలను కలసి వారికి రంజాన్ సుభాకాంక్షలు తెలిపారు.

చాగల్లు మండలంలో..

చాగల్లు: స్థానిక జామా మసీదు కమిటీ ఆధ్వర్యంలో ముస్లింలు రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మసీద్ ముతవల్లీ, మజీద్ కమిటీ సభ్యులు, ముస్లిం పెద్దలు, పాల్గొన్నారు. దారవరం, బ్రాహ్మణగూడెం మసీదులలో రంజాన్ పండుగను ఘనంగా జరుపుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఇరు వర్గాలపై కేసులు నమోదు

తాళ్లపూడిలో సిరిబొమ్మ ఉత్సవంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ



తాళ్లపూడిలో సిరిబొమ్మ ఉత్సవం

తాళ్లపూడి: స్థానిక మోదుగులమ్మ తల్లి ఆలయం వద్ద సిరిబొమ్మ ఉత్సవంలో అపశృతి చోటు చేసుకోవడంతో ఇరు వర్గాల పై కేసులు నమోదు చేసినట్లు తాళ్లపూడి ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. ఆదివారం తాళ్లపూడిలోని గ్రామ దేవత మోదుగులమ్మ ఉత్సవం సందర్భంగా సిరిబొమ్మకు గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఈ ఉత్సవంలో సిరిబొమ్మ ను ఓ కొయ్యకు కట్టి బహిరంగ ప్రదేశంలో తిప్పుతారు. ఆ సమయంలో జీడి మామిడిపండ్లను సిరిబొమ్మపై విసరడం ఆచారంగా వస్తోంది. సిరిబొమ్మను తిప్పే కార్యక్రమం ప్రారంభం కాక ముందే కొందరు పండ్లతో, రాళ్లతో కొట్టారు. ఇది రెండు కులాల మధ్య వివాదంగా మారింది. రాత్రంతా ఆ ప్రాంతంలో ఘర్షణ వాతావరణం నెలకొంది. రాత్రి వేళ ఒక వ్యక్తి ఇంట్లోకి వెళ్లి వస్తువులను చెల్లాచెదురు చేసి, బైక్‌ను పడ వేసి నిప్పు పెడుతుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో రెండు వర్గాల వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు. ఈ మేరకు రెండు కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఇరువర్గాల నుంచి వివాదానికి కారకులైన పది మందిని గుర్తించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉగాది రైతు సేవా పురస్కారాల ప్రదానం



ఉత్తమ రైతులకు సేవా పురస్కారాలు అందిస్తున్న మానవత సంస్థ సభ్యులు

నిడదవోలు: స్థానిక టౌన్ హాలులో నిడదవోలు మానవత సంస్థ ఆధ్వర్యంలో మానవత సంస్థ అధ్యక్షుడు దారపురెడ్డి సూర్యచంద్రరావు అధ్యక్షతన సోమవారం 11 మంది రైతులకు ఉగాది రైతు సేవా పురస్కారాలను అందజేశారు. రైతులు సూరపనేని గణేశ్వరరావు, కాజ సాయిబాబు, బోణం నాగేశ్వరరావు, కొప్పుశెట్టి నాగేశ్వరరావు, సాగిరాజు వెంకట్రాజు, మెట్టపల్లి గోపాలకృష్ణ, ఈడ్పుగంటి రామకృష్ణ, చోళ్ళ రాజు, పిచ్చికల వెంకటరామకృష్ణ, బొడ్డు సోమరాజు, తాతపూడి శాంతారామ్‌ను సత్కరించి, పురస్కారాలు ప్రదానం చేశారు. అనంతరం పేద విద్యార్థిని శ్రీలక్ష్మి శ్రీజకు రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్. మాధవరావు, శాస్త్రవేత్తలు డాక్టర్ చల్లా వెంకట నర్సింహారావు, డాక్టర్ మానుకొండ శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ, ఆలపాటి నాగేశ్వరరావు, జిల్లా మానవతా అధ్యక్షుడు దేవినేని భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు ప్రజల సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీక ఉగాది



మార్కొండపాడులో ఉగాది పురస్కారాలతో సత్కరించిన దృశ్యం

చాగల్లు: తెలుగు ప్రజల సంస్కృతి, సంప్రదాయం, వారసత్వం, ఆచార వ్యవహారాలకు ప్రతీక అయిన ఉగాది పండుగను వేడుకగా జరుపుకోవడం అభినందనీయమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సుంకవల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మార్కొండపాడు శ్రీనిలయంలో సోమవారం నిర్వహించిన ఉగాది పురస్కారాల ప్రదానం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. సుంకవల్లి వెంకటరత్నం మెమోరియల్ ట్రస్టు, సుంకవల్లి ఫౌండేషన్ ద్వారా సేవలు అందిస్తున్న అధ్యక్షుడు వెంకన్న చౌదరిని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అభినందించారు. ఉత్తమ అవార్డుతో రైతులు, విద్యార్థులు, అధికారులను సన్మానించి, జ్ఞాపికలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో శశి విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, మాజీ ఉపకులపతి పులపా సుబ్బారావు, డీఈవో కే వాసుదేవరావు పాల్గొన్నారు.

ప్రసన్నకుమార్ సేవలు అభినందనీయం



ప్రసన్నకుమార్ దంపతులను సత్కరిస్తున్న ఎంపీపీ కాకర్ల నారాయుడు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో పీబీవీ ప్రసాద్

కొవ్వూరు: ఎంపీడీవో కార్యాలయ పరిపాలనాధికారిగా సుదీర్ఘ కాలం పనిచేసి పదవీ విరమణ పొందిన కోటగిరి ప్రసన్నకుమార్ అందించిన సేవలను పలువురు అధికారులు, రాజకీయ నాయకులు కొనియాడారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ప్రసన్నకుమార్ పదవీ విరమణ సందర్భంగా అభినందన సభ నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్‌గా ప్రసాద్ సమర్థవంతంగా పనిచేశారన్నారు. అన్ని రాజకీయ పార్టీ నాయకులను, అధికారులను సమన్వయ పరుచుకుంటూ వివాదరహితుడుగా ప్రసన్నకుమార్ పేరుగాంచారని ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ (నారాయుడు) కొనియాడారు. ప్రసన్నకుమార్ దంపతులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు బొంతా వెంకటలక్ష్మి, మాజీ ఎంపీపీ వేగి సత్యనారాయణ (చిన్నా), పీకే రంగారావు, వైఎస్ ఎంపీపీ వీరమళ్ల నారాయుడు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో పీబీవీ రమణ, మాజీ ఏఎంసీ చైర్మన్ బండి పట్టాభిరామారావు, నాయకులు ఉప్పులూరి సూరి బాబు, కాకర్ల బ్రహ్మాజీ, ముదునూరి నాగరాజు, ఉప్పులూరి నానాజీ, పలువురు అధికారులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, మండల కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సువర్ణరాజుపై అసత్య ప్రచారం తగదు

నల్లజర్ల: గోపాలపురం నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జ్ దొడ్డిగర్ల సువర్ణరాజుపై అసత్య ప్రచారం చేయడం తగదని, ఇటువంటి చర్యలను సహించబోమని జనసైనికులు హెచ్చరించారు. జనసేన జిల్లా కార్యదర్శి అచ్యుత సత్యనారాయణ అధ్యక్షతన సోమవారం అచ్చన్నపాలెం కాకర్ల కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. జిల్లా ప్రోగ్రామింగ్ కమిటీ అధ్యక్షుడు కవులూరు సత్తిబాబు మాట్లాడుతూ విజయవాడలో వరద బాధితుల సహాయార్థం నియోజకవర్గ స్థాయిలో బియ్యం సేకరణకు సువర్ణరాజు పిలుపునిచ్చారని, ముందుగా సేకరించిన బియ్యం పాడయ్యాయని తెలిపారు. పాడైన బియ్యం బాధితులకు ఇవ్వడం భావ్యం కాదని నిర్ణయించి వాటిని విక్రయించి వచ్చిన సొమ్మును సీఎం సహాయనిధికి జమ చేయాలనే ఆలోచన చేయగా కొంత జాప్యమైందన్నారు. దీనిపై అనేక కథనాలు మీడియాలో వచ్చాయన్నారు. బియ్యం విక్రయించగా వచ్చిన రూ.10.65 లక్షలు సువర్ణరాజు ఖాతాలోనే ఉన్నాయని వారన్నారు. సమావేశంలో రుద్రాశ్రీనివాస్, అనిశెట్టి గంగరాజు, దాకారపు నరసింహమూర్తి పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు సన్మానం

ధవళేశ్వరం: అన్ని రంగాల్లో ట్రాన్స్‌జెండర్లు రాణిస్తున్నారని ట్రాన్స్‌జెండర్స్ సంఘ నాయకురాలు మందాకిని అన్నారు. చేంజెస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ధవళేశ్వరంలో ప్రపంచ ట్రాన్స్‌జెండర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌జెండర్లు మందానికి, రాజేశ్వరిలను సన్మానించారు. మందాకిని మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్లను గౌరవించాలని, వారికి చట్టపరమైన హక్కులను కల్పించాలని కోరారు.

WANTED TEACHERS

HIGH SCHOOL	Primary
Maths - 2	English - 2
Hindi - 2	Maths - 2
English - 1	Hindi - 1
Social - 1	Computer Teacher - 1
PS - 1	Computer Operator - 1
IIT - 1	

Attractive Salary
Walk-in-interview
Date: April - 5th, 6th
Time: 9:00am to 6:00pm
Send your resume to
pericherla.prkraju@gmail.com
Contact: 83286 85666
WhatsApp: 89859 85259
Swarnabharthi EM High School
Dharmavaram, Kovvur Mandal, E.G.District

క్షేమంగా ఇంటికి చేరిన బాలిక



పాపను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్సై క్రాంతికుమార్

- ఫిర్యాదు వచ్చిన రెండు గంటల్లోనే ఛేదించిన ధవళేశ్వరం పోలీసులు
- ఎస్పీ అభినందనలు

ధవళేశ్వరం: ఇంటి నుంచి అదృశ్యమైన బాలికను పోలీసులు క్షేమంగా తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. ఫిర్యాదు వచ్చిన రెండు గంటల్లో బాలికను కనిపెట్టారు. వివరాల్లోకి వెళితే.. ధవళేశ్వరంలోని వాడపేటకు చెందిన 9 ఏళ్ల శ్రీదుర్గ సోమవారం ఉదయం ఇంటి నుంచి మాయమైంది. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల అన్ని చోట్లా గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో తల్లిదండ్రులు మధ్యాహ్నం 3 గంటలకు ధవళేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్పీ నరసింహ కిషోర్, సౌత్‌జోన్ డీఎస్పీ భవ్య కిషోర్ ఆధ్వర్యంలో ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్ సిబ్బందిని నాలుగు బృందాలుగా ఏర్పాటు చేసి గాలించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సీసీ కెమెరాల సాయంతో ఆ బాలిక శ్యామలా సెంటర్‌లో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకొని బాలికను ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. కేసును త్వరితగతిన ఛేదించిన సీఐ టి.గణేష్, ఎస్సై క్రాంతి కుమార్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

పంచాంగాల పంపిణీ

కడియం: మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గ్రంధి నాగేశ్వరరావు (నాగబాబు) ఆధ్వర్యంలో స్థానిక ఆంజనేయ స్వామి ఆలయం వద్ద సోమవారం విశ్వావసు నామ సంవత్సర పంచాంగాలను పంపిణీ చేశారు. ఉమ్మడి జిల్లా సంఘం అధ్యక్షుడు కంచర్ల బాబీ సమకూర్చిన వీటిని గ్రామ సంఘాల అధ్యక్షులకు అందజేస్తున్నట్లు నాగబాబు తెలిపారు. కార్యక్రమంలో సంఘ ప్రముఖులు వారణాశి శ్రీనివాసగుప్తా, తమ్మన సత్తిబాబు, కాకి దుర్గాప్రసాద్, కంచర్ల మూర్తి, గ్రంధి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కిమ్స్ యాజమాన్యానిదే బాధ్యత

రాజమహేంద్రవరం సిటీ: కిమ్స్ బొల్లినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఫార్మాసిస్టు నాగాంజలికి ఏం జరిగినా ఆసుపత్రి యాజమాన్యమే బాధ్యత వహించాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వర రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం కాంగ్రెస్ నాయకులు ఆఆసుపత్రికి వెళ్లి నాగాంజలి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఆమెను లైంగికంగా వేధించిన దీపక్‌పై కఠిన చట్టాలు పెట్టకుండా పోలీసులు నిర్లక్ష్యంగా కేసు నమోదు చేశారని ఆరోపించారు. ఆ కుటుంబానికి కోటి రూపాయల నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.అలాగే పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై కూడా ప్రభుత్వం ఇలాగే డ్రామాలు నడిపిస్తోందన్నారు. పీసీసీ ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

కంబాలచెరువు: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్న లలితానగర్‌కు చెందిన దేవాబత్తుల నాగమహేష్‌పై కేసు నమోదైంది. మూడో పట్టణ పోలీసులు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. పాస్టర్ ప్రవీణ్ కుమార్‌ది రోడ్డు ప్రమాదం కాదని, అది హత్యేనని నాగమహేష్ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడు. దీంతో అతడిపై పోలీసులు కేసు నమోదు చేసి న్యాయమూర్తి ముందు హాజరుపర్చారు. నాగమహేష్‌పై తదుపరి విచారణకు ఆదేశించారు. పూర్తి విషయం తెలియకుండా తప్పుడు వార్తలను ప్రచారం చేసినా, ఫేక్ వీడియోలను పెట్టినా, మతపరమైన గొడవలకు ఆస్కారం ఉన్న పోస్టులు సామాజిక మాధ్యమాలలో పోస్టు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని త్రీటౌన్ సీఐ వి.అప్పారావు తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిడదవోలు డివిజన్
90102 23729 (కొవ్వూరు)
90100 51493 (నిడదవోలు)
90100 68395 (గోపాలపురం)
Office mail : tpgadvt@gmail.com